క్లుప్తంగా

ప్రతీ బూత్‌లో బీజేపీ సభ్యత్వం చేయించాలి



మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

మల్యాల: మండలంలోని ప్రతి బూత్‌లో 200 మందిని బీజేపీ సభ్యత్వం చేయించాలని కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగిడి కృష్ణారెడ్డి అన్నారు. మల్యాల మండల కేంద్రంలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదుపై బూత్ అధ్యక్షులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. కార్యకర్తలు సమష్టి కృషితో సభ్యత్వ నమోదు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జాడి బాల్‌రెడ్డి, పెరక శ్రణ్, గాజుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల బస్ డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోరుట్ల: పట్టణంలోని ఆర్టీసీ బస్‌డిపోలో డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో బుధవారం గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్–ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పట్టణానికి చెందిన వైద్యుడు బోగ శంకర్ ప్రారంభి ఉద్యోగులకు, వారి కుటుంబసభ్యులకు ఆరోగ్య సూచనలు చేశారు. సంస్థలో పనిచేసే ప్రతీ ఉద్యోగి, వారి జీవిత భాగస్వామికి హెల్త్ చెకప్ చేయాలని గ్రాండ్ హెల్త్ చెకప్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. డిపోలో పని చేసే ఉద్యోగులకు వారి జీవిత భాగస్వాములకు హెల్త్ చెకప్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసు అమరులకు భారత్ సురక్షా సమితి నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఎపోలీసు అమరవీరులకు భారత్ సురక్షా సమితి నాయకులు నివాళి అర్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకుని బుధవారం జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పక్కన గల పోలీసు అమరవీరుడు ఎస్పీ ప్రవీణ్‌చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు మాట్లాడుతూ దేశభద్రత, సమగ్రత, సమైక్యత కోసం అసువులు బాసిన పోలీసు సిబ్బందికి దేశం తరపున ఘన నివాళి అర్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పుప్పాల సత్యనారాయణ, అక్కినపెల్లి కాశీనాథం, బండారి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత గురుకులాల్లో మార్పులు చేయాలి

రాయికల్: సమీకృత గురుకులాల ఏర్పాటులో మార్పులు చేయాలని, బడ్జెట్‌లో విద్య కోసం 15 శాతం కేటాయించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్ల లో విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో పాటు, కులాలు, మతాల ప్రతిపాదికన గురుకులాలను ఏర్పాటు చేసి సమాజాన్ని వేరుచేసే ప్రయత్నం చేయడంతో ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పెండింగ్ డీఏలు, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కార్మికులకు వైద్య శిబిరం

జగిత్యాల: ఐఎంఏ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు గురువారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్ తెలిపారు. పట్టణ పారిశుధ్య కార్మికులకు ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మికులకు అన్ని రకాల పరీక్షలతోపాటు, ఈసీజీ, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే ఉచితంగా చేయబడతాయన్నారు. కార్మికులందరూ ఉదయమే రావాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రాయికల్ ఆస్పత్రి

- వైద్యులకు గదుల కొరత
- రోగులకు ఒక్కటే మరుగుదొడ్డి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ఇబ్బందుల్లో రోగులు, వైద్యులు
- నేడు హెచ్‌డీఎస్ సమావేశం



రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లోని నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను వైద్య విధాన పరిషత్‌లోకి మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఆస్పత్రికి డెవలప్‌మెంట్ కోసం నేటి వరకు ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆస్పత్రిలో శానిటేషన్, డ్రెయినేజీ సమస్యలు తాండవిస్తున్నాయి.

ఆస్పత్రిలో సమస్యలు..

రాయికల్ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించేందుకు గాను డిప్యూటేషన్‌పై డాక్టర్ శశికాంత్‌రెడ్డి సూపరింటెండెంట్, డాక్టర్ ఒడ్నాల రజిత డీజీవో, డాక్టర్ వాణి ఫార్మలజిస్ట్, డాక్టర్ శ్రీకాంత్ మత్తు డాక్టర్, తేజస్విని మెడికల్ ఆఫీసర్ రెగ్యులర్‌గా ఉండగా డాక్టర్ ఉదయ్ కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి సరిపడా గదులు లేకపోవడంతో ఒకే గదిలో 2–3 డాక్టర్లు కూర్చుని రోగులకు వైద్యం చేయాల్సి వస్తోంది. అంతేకాకుండా ఆపరేషన్ థియేటర్ హాల్, డాక్టర్ రూమ్స్‌లో సైతం వర్షాలు కురిస్తే స్లాబ్‌లోంచి నీరు లీకేజీ అవుతోంది. ఇన్‌పేషెంట్స్ హాల్‌లో గతంలో నాలుగు మరుగుదొడ్లు ఉండగా ప్రస్తుతం ఒకే ఒక్క మరుగుదొడ్డి మాత్రమే వినియోగంలో ఉండటంతో వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌పేషెంట్ హాల్‌లో కిటికీలు సరిగా లేకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. గురువారం జరిగే ఆస్పత్రి డెవలప్‌మెంట్ సొసైటీ సమీక్ష సమావేశంలో సమస్యలపై చర్చించాలని, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సమస్యల పరిష్కరిస్తారని కృషి చేయాలని రోగులు, వైద్యులు కోరుతున్నారు.



నాలుగు మరుగుదొడ్లకు కేవలం ఒక మరుగు దొడ్డి వినియోగం

దుర్వాసన భరించలేకపోతున్నాం



మాది రాయికల్ మండలం తాట్లవాయి గ్రామం. నాకు మూడు రోజుల నుంచి జ్వరం రావడంతో ఆస్పత్రిలో జాయిన్ అయ్యాను. ఇక్కడ ఒక్కటే మరుగుదొడ్డి పనిచేయడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. డ్రెయినేజీ సమస్య సరిగా లేదు. అధికారులు సమస్యను పరిష్కరించాలి. – లావణ్య, తాట్లవాయి

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్ వైద్య విధాన పరిషత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కలెక్టర్ వద్ద రూ.5 లక్షల నిధులతో చేపట్టబోయే పనులపై నివేదికను అందజేశాం. అంతేకాకుండా గురువారం జరిగే సమావేశంలో సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసువెళ్తాం.

– శశికాంత్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్

పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

కోరుట్ల రూరల్: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఎంపీడీవోలను ఆదేశించారు. కోరుట్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోలులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మండల స్థాయి అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా పారిశుధ్య లోపం కనిపిస్తుందన్నారు. జ్వరాలు ప్రబలుతున్నందునా.. పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్లు, బ్రిడ్జీలు త్వరగా పూర్తి చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు రామకృష్ణ, చంద్రశేఖర్, జగదీశ్, మెట్‌పెల్లి డీఈ రాంరెడ్డి, కోరుట్ల డీఈ సత్యనారాయణ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ..

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 42 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బుధవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అందజేశారు. ఒకరికి రూ. 75 వేల ఎల్‌వోసీ అందించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీత మామ వేముల లక్ష్మీపతి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చింతల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

చేప పిల్లలు సకాలంలో పంపిణీ చేయడంలో విఫలం

మెట్‌పల్లి: చేప పిల్లలను సకాలంలో పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. పట్టణ శివారులోని పెద్ద చెరువులోకి బుధవారం మత్స్య శాఖ అధికారులు ఎమ్మెల్యే చేతుల మీదుగా చేప పిల్లలను వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా జూన్‌లో పంపిణీ చేయాల్సి ఉండగా, ఈసారి అక్టోబర్‌లో ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జిల్లా అధికారి విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, డీసీఎఫ్‌ఎస్ చైర్మన్ పల్లికొండ ప్రవీణ్ పాల్గొన్నారు.

మా ఊరికి బస్సు నడపండి

- ఆర్టీసీ బస్సును అడ్డుకున్న కోమన్‌పల్లి, డొంకేశ్వరం మహిళలు



ధర్నా చేస్తున్న కోమన్‌పల్లి, డొంకేశ్వరం మహిళలు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కోమన్‌పల్లి, డొంకేశ్వరం గ్రామాలకు ఆర్టీసీ బస్సు రావాలని రెండు గ్రామాల ప్రజలు బుధవారం రోడ్డుపై ధర్నా చేపట్టారు. జగిత్యాల డిపో బస్సు ధర్మపురి నుంచి ఆరెపల్లి వెళ్లున్న సమయంలో కోమన్‌పల్లి, డొంకేశ్వరం గ్రామాల్లోకి రావాలని గ్రామస్తులు పేర్కొన్నారు. గతంలో ఈ బస్సు కోమన్‌పల్లి, డొంకేశ్వరం గ్రామాల మీదుగా ఆరెపల్లి వెళుతుండేదని, కరోనా సమయంలో ఈ బస్సును రద్దు చేశారని, అప్పటి నుండి నేటి వరకు బస్సు పునరుద్ధరించకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నామని పేర్కొంటూ రోడ్డుపై భైఠాయించారు. విషయం తెలిసిన బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి, పోలీసులు అక్కడికి చేరుకుని ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సును తిరిగి ప్రారంభిస్తామనే హామీతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీపతి రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



గేదెకు టీకాలు వేస్తున్న వైద్యుడు

జగిత్యాలఅగ్రికల్చర్: సీజనల్ వ్యాధుల పట్ల పాడి పశువుల రైతులు అప్రమత్తంగా ఉండాలని మోరపల్లి పశువైద్యుడు డాక్టర్ నరేశ్ రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో దాదాపు 250 పాడి పశువులకు బుధవారం గాలి కుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి గేదేలకు సమీకృత దాణా అందించి, మంచి పాల దిగుబడిని పొందాలని సూచించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు ,సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాల: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని కల్లెడ ఇన్‌చార్జి వెటర్నరి అసిస్టెంట్ సర్జన్ హిమజ అన్నారు. జగిత్యాల మండలం పొరండ్లలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్, రాజేశ్, గంగాధర్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లాపూర్: మూగజీవాల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రాఘవపేట లో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, వీడీసీ సభ్యులు, పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఆలూరులో పశువులకు బుధవారం ఎల్‌ఎస్‌ఏ ఖలీక్ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు రాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, కార్యదర్శి రమ్యకృష్ణ, సిబ్బంది అనిల్, ప్రేమ్, గంగచారి, సంతోష్, బుచ్చన్న లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్: మండలంలోని భూషణ్‌రావుపేట గ్రామంలో ముగ్గురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కళ్యాణి, దుర్గవ్వ,సాత్విక్ లకు రూ.87 వేల విలువ గల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం చిన్నారెడ్డి, రాజిరెడ్డి, స్వామిరెడ్డి, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అందించాలి

రాయికల్: గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా వెంటనే అందించాలని గీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఉత్కం సాయగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాయికల్ మండల అయోధ్య గ్రామంలో గౌడ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో లింగంగౌడ్, మల్లయ్య, తిరుపతిగౌడ్, సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

వరి కోసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాల: యంత్రాలతో వరి కోసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. బుధవారం హార్వేస్టర్ల యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంట కోత దశకు వచ్చిన తర్వాతే కోయాలని, యంత్రం నడిపేటప్పుడు ఇంజన్ ఫ్యాన్ స్పీడ్‌ను 18–19 ఆర్పీఎంగా ఉంచాలని, దీని వల్ల కోత కోసిన ధాన్యం వేగంగా తరిగి ఫ్యాన్ గాలితో ధాన్యం అంతా శుద్ధి అయితాలు తప్ప, పక్వానికి రాని గింజలు కొట్టుకుపోయి శుభ్రమైన ధాన్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో డీఏవో రాంచంద్రం, డీసీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీఎంసీఎస్ జితేందర్ ప్రసాద్, డీసీవో మనోజ్, డీటీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

మెట్‌పల్లిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్‌పల్లి మండలం వేంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి సహకార సంఘం చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లింగం, మాజీ జెడ్పీటీసీ లింగారెడ్డి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలి

జగిత్యాల: అన్ని పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని జిల్లా కలెక్టర్‌కు పీఆర్టీయూ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2002–2003 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులతో కలిసి బుధవారం గురుశిష్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులతో పాటు శిష్యుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో అనాటి ఉపాధ్యాయులు సూరజ్ శివ శంకర్, జనార్దన్, లింగయ్య, వెంకటచారి, రమేశ్, నాగలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



కథలాపూర్: కథలాపూర్ మండలం దూలూర్- బొమ్మెన గ్రామాల మధ్య వాగుపై ఉన్న లో లెవెల్ వంతెన వద్ద వర్షాకాలంలో నీటి ఉధృతి పెరిగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇక్కడ హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీకాంత్, ఏఈ, రోడ్లు, భవనాల శాఖ కోరుట్ల డివిజన్ సెల్ నంబర్:94417406161

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న రాంరాజ్

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ట్రినర్ రాంరాజ్ అన్నారు. బుధవారం జగిత్యాల ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల సిబ్బందికి మార్కెటింగ్ ట్యాబ్ ఎంట్రీ ఐరీష్ వాడకంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ప్రతి రైతు నుంచి ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా నంబరు జిరాక్స్‌లు తీసుకుని రిజిష్టర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దాని ద్వారా ధాన్యం ఎంత వచ్చింది, ట్యాబ్‌లో సరిగా ధాన్యం సంచులు, కొనుగోలు వివరాలు నమోదు చేయాలన్నారు. రైతు ఇచ్చిన ఆధార్‌కార్డు ఆధారంగా అమ్మకం అయ్యాక చెల్లింపుల నమోదు సమయంలో రైతు కళ్లను ఐరీష్ పద్ధతిలో నమోదు చేసి ధాన్యం డబ్బులు ఖాతాకు చెల్లింపులు జరిపేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, విద్యాసాగర్, మరియ, గంగారాం సిబ్బంది పద్మ, సురేందర్, అశోక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల సందర్శన



విద్యార్థులకు సూచనలిస్తున్న డీఐఈవో

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జగిత్యాల జిల్లా డీఐఈవో వెంకటేశ్వర్లు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బోధనా తరగతరులను పరిశీలించి విద్యార్థులను బోధనా అభ్యసన సమస్యల గురించి అడిగి తెలుసుకుని ఉపన్యాసకులకు తగు సూచనలిచ్చారు. ప్రతి రోజు విద్యార్థులు కళాశాలకు హాజరై కష్టపడి చదివి సత్ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, మనోవికాసానికి, సర్వతో ముఖాభివృద్ధికి క్రీడలకు ప్రోత్సహించి చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు చొరవ చూపాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ధర్మయుద్ధ మహాసభ విజయవంతం చేయాలి

రాయికల్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ రాష్ట్రంలో అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యానికి నిరసనగా ఈనెల 27న జగిత్యాలలో ధర్మయుద్ధ మహాసభ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీశ్ మాదిగ కోరారు. బుధవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని, మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బాపురపు నర్సయ్య, పాలెపు బాలరాజు, పాలెపు సురేశ్, అజయ్, గణేశ్, అరవింద్, సుమంత్ పాల్గొన్నారు.

బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

ధర్మపురి: పట్టణంలో బుధవారం బీజేపీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి హాజరై మాట్లాడారు. బీజేపీ బలోపేతం కోసం వంద శాతం సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నం అంజన్న, జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం, పట్టణ మండల శాఖ అధ్యక్షుడు లవన్‌కుమార్, సంగెపు గంగారాం, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడవిపంది మాంసం విక్రేత అరెస్ట్

రాయికల్:రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ శివారులో అల్లెపు గంగనర్సయ్య అడవి పంది మాంసం విక్రయిస్తుండగా బుధవారం సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, బీట్ ఆఫీసర్ రత్నాకర్, వసీం పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

డిగ్రీ సర్టిఫికెట్ మీద గెజిటెడ్ సంతకం చేయించాలి

ఇబ్రహీంపట్నం: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తమ డిగ్రీ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీపై గెజిటెడ్ అధికారి సంతకం చేసి, స్టాంప్ వేసి దరఖాస్తుతో పాటు జత చేసి తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని తహసీల్దార్ ప్రసాద్ బుధవారం తెలిపారు. వచ్చే నెల 6 వరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్‌గా నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

పట్టణ పారిశుధ్య కమిటీ ఎన్నిక

మల్యాల: మండలంలోని మల్యాల పట్టణ పారిశుధ్య కమిటీ నూతన కమిటీ(సీఐటీయూ)ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉప్పరి రవి, ఉపాధ్యక్షుడిగా ఉప్పు రవి, కోశాధికారిగా మోత్కుల లావణ్య, ప్రధాన కార్యదర్శిగా కోరెపు నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా పోడేటి నర్సమ్మ, సభ్యులుగా దువ్వాక కాంతమ్మ, మల్యాల నర్సమ్మ, ముత్యాల రాజయ్యను ఎన్నుకున్నట్లు మండల సీఐటీయూ మండలాధ్యక్షుడు కోరెపు మల్లేశం తెలిపారు.

లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

సారంగాపూర్: మండలంలోని 18 గ్రామపంచాయతీల్లో నర్సరీల్లో 2,25,800 మొక్కలను పెంచడం లక్ష్యంగా నిర్ణయించినట్లు ఎంపీడీవో గంగాధర్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 పంచాయతీల్లో ప్రతి పంచాయతీకి 12,500 మొక్కల చొప్పున నర్సరీలను ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మొక్కలను మినహాయించి లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరణ

పెగడపల్లి:మండల విద్యాధికారిగా మండలంలోని నామాపూర్ హైస్కూల్ హెచ్‌ం సులోచనను నియమించారు. ఈ మేరకు బుధవారం ఎంఆర్సీ భవనంలో బాధ్యతలు స్వీకరించగా పలువురు ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్లాపూర్: మండలంలోని రేగుంట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 7.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డి తెలిపారు.